## 'అంతేనా?!'

## 'ఇంకేం కావాలి?'

## 'వీలైతే నాలుగు మాటలు...కుదిరితే కప్పు కాఫీ...'

మొబైల్ రింగ్ టోన్‌లో వినిపించే మాటలవి. సంగీతం కలిసిన మాటలవి. తెల్లవారుజాము నిద్రలో ఏవేవో కలలు కలవరపెడుతుంటే తలపక్కనే ఉన్న మొబైల్ రింగ్‌టోన్ పిలుస్తుంది. ఫోన్ ఎత్తడానికి మా ఆవిడ కూడా ఇంట్లో లేదు.

హాల్లో ఫ్రెండ్ నిద్రిస్తున్నాడు. ఆయన నా కన్న ముందే లేచి, నన్ను నిద్రలేపడానికి రింగ్ చేస్తున్నాడేమో అనే సందేహం వచ్చింది.

'అన్నా! శీనన్నా ఇక్కడే ఉన్నా' అని ముసుగు తీయకుండానే గట్టిగా చెప్పాను.

ఆయన మంచి నిద్రలో వున్నాడేమో సమాధానం రాలేదు.

రింగ్‌టోన్ అదే పనిగా మోగుతుంది.

ఇక తప్పదన్నట్టుగా మొబైల్ ఎత్తాను.

# 'కాక్లా'

## కథ

**భూక్య తిరుపతి**

'మామీ రాత్రి సచ్చిపోయింది.' అటు వైపు నించి ఎవరో చెప్తున్నారు. నాకేమీ అర్థం కాలేదు.

మళ్లీ అడిగాను. ఏం జరిగిందని.

'రాత్రి కురిసిన వానకు ఎక్కడో కరెంటు వైరు తెగిపోయింది. మామీ కరెంటు షాకు కొట్టి రాత్రి సచ్చిపోయింది. నువ్వు వెంటనే బయల్దేరాలి.' మా భాయి చెప్పాడు.

నేనింకా ఏదో అడిగేలోపే ఫోన్ కట్ అయింది.

మామీ సచ్చిపోయిందనే విషయం నన్ను కలవరపరిచింది.

మార్ యాడీర్ (అమ్మ) సొంత భియా భార్య. మామీ... మామీ అని ఘాగ్రో (ఘాగ్రా) ఒదిలేవాణ్ణి కాదు. చిన్నప్పుడు గావురం చేసేవాన్ని. నన్ను ఎత్తుకొని ఆడించేది. అడిగినవి కొనిపెట్టేది.

ఎంతో ప్రేమగా ఆప్యాయంగా చూసుకొనే మామీ కరెంట్ షాక్ వల్ల మరణించందంటే జీర్ణించుకోలేకపోతున్నా.

నిద్ర ఇచ్చుకపోయింది.

లేచి బెడ్ రూంలో అటూ ఇటూ తిరిగాను.

బయటికొచ్చాను.

హాల్లో నిద్రిస్తున్న శీనన్నను లేపా.

ఆయన అటూ ఇటూ దొర్లి మళ్లీ నిద్రలోకి జారిపోయాడు.


ఏం చేయాలో తోచలేదు. వరంగల్ వెళ్లాలంటే కనీసం పదిహేను గంటలు పడుతుంది. తక్షణమే ట్రైను లేదు. బస్సులో వెళ్ళడం చాలా కష్టం. కుప్పం చెన్నై, బెంగ్లూరికి దగ్గర. వరంగల్‌కు ఎంతో దూరం. ఉద్యోగరీత్యా కుప్పంలో ఉంటున్నా. అయినవాళ్ళకు ఆపదొచ్చినప్పుడు ఎంత వేగంగా చేరుకుందామన్నా వీలు కాదు.

భాయి. చెప్పింది వాస్తవమో కాదో తెలుసుకుందామని మళ్ళీ ఫోను చేశా. అటువైపు ఫోన్ ఎత్తగానే ఏడుపులు పెడబొబ్బలు వినిపిస్తున్నై. అందినవార్త వాస్తవమనిపించింది.

యాడీ (అమ్మ) రోదన వినిపిస్తుంది.

'కన్నా ఆయేచీ, భియా' అని మా భాయి అడిగాడు.

'బయల్దేరుతున్నా'- బదులిచ్చి ఫోన్ కట్ చేశాను.





'భనోయి, టెన్షన్ పడ్ మత్. నిన్న మామీ గొడ్లను మేతకు తోలుకపోయింది. అక్కడ కాక్లా (కాకి) నెత్తి మీద తన్నిపోయింది. తండాలో అందరూ అది కీడు అన్నరు. కీడు పోవాలంటే, మామీ చచ్చిపోయిందని సాముణునె (చుట్టాలను) పిల్వాలి అన్నరు. అందుకే అందరికీ చెప్పాం' అన్నాడు. ఒక్కసారిగా నాకు కోపం వచ్చింది.

కానీ, ఏం చేసేది?

శీనన్న నా అలికిడి విన్నాడేమో నిద్ర లేచాడు. కళ్ళు తుడుచుకొన్నాడు.

ఎప్పుడు చేశాడో తెలియదు.. కాని, 'చాయ్ తాగు?' అన్నాడు. వద్దని సైగ చేశా.

పత్రికలో ఏముందో చూడాలనుకున్నా. కానీ, చదవాలనిపించలేదు.

'ఏం జరిగింది?' అడిగాడు శీనన్న. నాలోని అశాంతిని పసిగట్టినట్టున్నాడు.

'మా మేనత్త చనిపోయిందట!'

కళ్ళు ఒక్కసారిగా జలపాతాలయ్యాయి.

ఏ విధంగా ఓదార్చాలో ఆయనకు తోచినట్టు లేదు. నిశ్చేష్టుడై చూస్తున్నాడు.

కొంతసేపు తర్వాత తేరుకొని 'మీ మేనత్త ఎంత వయసు ఉంటుంది?' అడిగాడు.

'సుమారు యాభై యేళ్ళు ఉంటుందేమో!'

'అంత చిన్న వయసులో...'

'మావోళ్ళ ఆయుస్సు తక్కువే. అయినా, ఆమె చావాల్సిన మనిషి కాదు.'

'అవునా?'

'చాలా మంచిది. మా మేనమామ పోయి పదేళ్ళు. కుటుంబాన్ని పోషించడానికి ఎన్నో కష్టాలు పడింది. ముగ్గురు కొడుకులున్నా ఇంటికి తానే పెద్ద దిక్కు. ఏ కొడుకు సరిగా చూసుకున్నది లేదు.

పాపం. ఆడోళ్ళకు సుఖమెక్కడిది. పుట్టింది మొదలు సచ్చేదాకా ఆమె కష్టాలే చూసింది.'

'అందరూ అంతేలే! కూలీ నాలీ చేసుకుని బతికేవాళ్ళు కష్టసుఖాలు ఆలోచించలేరు. జీవితాన్ని గుంజుకురావడమే వాళ్ళ ముందున్న సమస్య.'

కనీసం కన్న కొడుకులైనా సరిగా చూడలేదు. కోడలుతో గొడవ పడి చెల్లె దగ్గరికి పోతుంది.

అక్కడైనా పది రోజులుంటుందా? అంటే అదీ లేదు. మూడు రోజులకే మనవడు ఎట్లుండో, మనవరాలు ఏంజేస్తుందో అని ఉరుకొస్తుంది.

కొడుకుల మీది కన్నా పిల్లల మీద పావురం ఎక్కువ.' నాలో నేనే మాట్లాడుకుంటున్న.

'సరే, ఇంకెవ్వరినైనా అడుగు. కరెంటు షాకుతో చనిపోయిందంటే నమ్మాలనిపించట్లేదు.' శీనన్న పురమాయించాడు.

ఈసారి మార్ సాళెసె ఫోను చేశాను.

అవును బావా. వెంటనే బయల్దేరమని ఏడుస్తూ చెప్పాడు.

గుండె జారిపోయింది నాకు. ఇక ఉండలేకపోయాను.

శీనన్న కూడా కంగారుపడిపోయి ప్రయాణంలో తీసుకోవాల్సిన జాగ్రతలేవో చెప్పాడు. అన్నీ అందరికీ తెలిసినా చెప్పకుండా వుండలేకపోవడమన్నది అభిమానం.

కుప్పం బస్‌స్టాండ్‌లో దొరికిన బస్సెక్కి పలమనేరు చేరుకున్నా.

అక్కడికి రావడానికి మూడు గంటలు పట్టింది. విజయవాడ వెళ్ళే హైటెక్ బస్సెక్కి కూర్చున్నా.

సమరసింహారెడ్డి సినిమా నడుస్తుంది, బస్సులో. సీమ బిడ్డలు అంత ఆసక్తిగా చూడటం లేదు. కాని, సీమేతరులు మాత్రం ఎంజాయ్ చేస్తున్నారు.

సీమ గురించి నాక్కొంచెం తెలుసు. అయితే, ఆ సినిమాను ఎంజాయ్ చేసే మూడ్‌లో లేను. కళ్ళముందు మామీనే కనిపిస్తుంది.

ఆమె చెప్పిన కథలు గుర్తొస్తున్నాయి.

ఆమెతో నా బాల్యం గుర్తొస్తుంది.

యాడ్కిఁ పోతుండావూ... అడిగాడు ఒకాయన. చిత్తూరు భాషలో.

'విజయవాడ' అని అయిష్టంగా బదులిచ్చా.

చిరాకులో వున్నానని గ్రహించినట్టున్నాడు. ఆ తరువాత మళ్ళీ అడగలేదు.

సాయంత్రం ఆరు గంటలకు విజయవాడ బస్‌స్టాండ్‌లో దిగాను.

ఆకలి, అలసట గుర్తుకు రాలేదు.

అక్కణ్నించి ఎట్లా వెళ్ళాలా అని ఆలోచిస్తూ నిలబడ్డా.

ఎక్కడికి వెళ్ళాలండీ అని క్రిష్ణా జిల్లా యాసలో ఒక వ్యక్తి అడిగాడు. నడీడు వయసు. వేషం కూడా బాగానే ఉంది.

ఎక్కడికి వెళ్ళాలో చెప్పాను.

'బస్సు ఎనిమిది గంటలకుంది. ట్రెన్ కూడా లేదు' అన్నాడు.

మళ్ళీ తనే అన్నాడు. 'అప్పటిదాకా ఎదురుచూస్తూ కూచుంటే బోరుకొడుతుంది. నాతో రండి మంచి టైంపాస్ అవుతుంది' అన్నాడు, తాపీగా.

ఆశ్చర్యంగా చూశాను. సరిగా అర్థం చేయించాలనుకున్నాడు కావొచ్చు.

'మంచి పిల్లుంది. లంబాడోల గుంట. చాలా అందంగా ఉంటది. ఒక్కసారి చూస్తిర్రా కాదనరు' నన్ను ప్రలోభపెట్టాలనే ప్రయత్నం చేస్తున్నాడు.

నాకు అసహనం, కోపం వేసింది. 'ఏ ఎట్లా కనబడుతున్నా. గుంటల దగ్గరికి పోయేవాడిలా వున్నానా? చెత్త నాకొడకా. వెళ్ళు ఇక్కణ్నించి' కోపంగా అన్నా. వాడు భయపడినట్టున్నాడు. లోపల్లోపలే తిట్టుకుంటూ వెళ్ళిపోయాడు.

మళ్ళీ మామీ యాదికొచ్చింది. ఆ తరువాత తండాలోని అనేక మంది అందమైన స్త్రీలు గుర్తొచ్చారు.

ఎయిడ్స్‌తో మరణించిన తండా అందగత్తె 'ఛమ్కోలి' గుర్తొచ్చింది.

ఆధునిక సమాజంలో కలిసిపోవాలని తహతహలాడిన తండా తన ఉనికినే కోల్పోయే పరిస్థితి దాపురించిందని గుర్తించలేకపోతుంది.

ఏమీ తోచక బస్టాండ్ అంతా కలియ తిరిగినా. రెండు గంటల తరువాత వరంగల్ బస్ ఎక్కా.

రాత్రి చల్లగాలి కిటికీ సందుల్లోంచి ఒంటిని తాకుతుంది.

బస్సులో కొందరు నిద్ర పోతున్నారు. కొందరు ఏవో కబుర్లు చెప్పుకుంటున్నారు.

అక్కడక్కడా బస్సు ఆగుతూ, కదులుతూ ఉంది.

చెక్ పోస్టు దగ్గర పోలీసులు బస్సెక్కారు. బస్సులో వున్నవారిని పరిశీలనగా చూశారు.

గ్రేహౌండ్స్ పోలీసులనుకుంటా. 'ఎక్కడికి పోతున్నవ్?' ఒక పోలీసు దురుసుగా అడిగాడు.

వరంగల్ అని సమాధానం చెప్పా. నా పద్ధతి కాస్తా అనుమానం కలిగిచిందేమో వివరాలు అడిగాడు. అసిస్టెంట్ ప్రొఫెసర్ అని చెప్పడంతో కాస్తా మర్యాద ప్రదర్శించాడు.

'తెలంగాణవాళ్లకు రాయలసీమలో ఉద్యోగాలిస్తున్నారా?!' అన్నాడు. నవ్వి ఊరుకున్నా.

అందరి సెల్ ఫోన్‌లు స్విఛాఫ్ చేయమన్నారు. నాకేదో భయం కలిగింది. కూంబింగ్ చేసి వచ్చినట్టున్నారు. ఎక్కడ అన్నలు దాడి చేస్తారో అనే భయం వాళ్ళలో కనిపిస్తోంది.

బస్సు అడవి దాటి ఒక ఊరు చేరుకుంది. పోలీసులు అక్కడ దిగిపోయారు. కిటికిలోంచి చూశాను. చీకటిగా ఉంది. వరంగల్లోని ఏదో ఒక ప్రాంతమని మాత్రం అర్థమైంది.



తెల్లవారుజామున వరంగల్‌లో దిగాను.

వళ్ళంతా నొప్పులు. అక్కణ్ణించి పర్వతగిరి బస్సెక్కాను. ఇంటికి చేరుకోడానికి గంట పడుతుంది. మామీ చనిపోయి ఈనాటికి లెక్క ప్రకారం మూడు రోజులవుతుంది. మా సంప్రదాయం ప్రకారం మామీకి కూడా దినాలు. ఆ ఊహే నన్ను కలవర పెడుతుంది. అతికష్టం మీద బస్ దిగి మామీ ఇంటికి చేరుకున్నా. బంధువులు, తండావాసులు ఇంటి ముందు గుంపులు గుంపులుగా కూర్చున్నారు. ఏడుస్తూ కొంతమంది, కబుర్లు చెప్పుకుంటూ కొంతమంది గందరగోళంగా వున్నారు. ఆడవాళ్ళు కొంగులు ముఖాల మీద కప్పుకొని ఏడుస్తూ ఉన్నారు. అందులో నిజంగా ఏడుస్తున్నదెవరో... కన్నీళ్ళు కారకుండా ఏ యాడీ అంటున్నదెవరో తెలిసే అవకాశం లేదు. అదొక ఆచారం. అంతే.

నన్ను చూసి మార్ యాడి బోరుమంది. ఎప్పటి నుంచో ఏడ్వాలనుంది. ఆపుకోలేక యేడ్చాను. ఒక పదినిమిషాలు ఏడ్చిన తరువాత మామీ ఫోటో అయినా చూడాలని ఇంట్లోకి వెళ్ళాను.

ఫోటోకు బదులు మామీ సజీవంగా ఉంది. ఏడుస్తో నా వేపు చూస్తోంది.

నాకు దిగ్భ్రాంతి. చూస్తోంది వాస్తవమో కాదో తోచలేదు. కాని మనిషి కళ్ళెదుట కనిపిస్తుంది. ఏం జరుగుతుందో అర్థం కాలేదు.

మామీ నా మీద పడి బావురుమంది. వెక్కి వెక్కి ఏడ్చింది.

ఎందుకిలా జరిగిందో... అసలేం జరుగుతుందో అర్థంకాక బిత్తరపోయాను. మామీ దుఃఖంలో మాత్రం విపరీతమైన వేదన ఉంది. నా చావు బతికి ఉండగానే చేస్తున్నారన్న వేదన ఉంది.

విపరీతమైన బాధ కలిగింది. పట్టరాని కోపం...

ఎదురుగా మార్‌సాలె కనిపించాడు. ఆవేశంతో నోటికొచ్చిన బూతులు తిట్టాను. వాడిని కడిగిపారేశాను.

'బావా టెన్షన్ పడకు. ఏమీ కాలేదు.' అన్నాడు.

వాడు చెప్తున్నాడు. 'భనోయి, టెన్షన్ పడ్ మత్. నిన్న మామీ గొర్లను మేతకు తోలుకపోయింది. అక్కడ కాక్లా (కాకి) నెత్తి మీద తన్నిపోయింది. తండాలో అందరూ అది కీడు అన్నరు.

కీడు పోవాలంటే, మామీ చచ్చిపోయిందని పాముణునె (చుట్టాలను) పిల్వాలి అన్నరు. అందుకే అందరికీ చెప్పాం' అన్నాడు.

ఒక్కసారిగా నాకు కోపం వచ్చింది. ఏం నమ్మకాల్రా మీవి. బంచన్ రేతాజ్ (బతికి ఉండగానే) మర్గీకన్ సేనే బలావోగే (మరణించిందని అందర్నీ పిలుస్తరా)? బుద్ధి లేదా?' ఆవేశంగా తిట్టా.

వాళ్ళ నమ్మకం పిచ్చిదే కావచ్చు. అది మూఢనమ్మకమని చెప్పినా వినే పరిస్థితిలో లేరు. నా ఆలోచనలు, పద్ధతులు తెలిసిన చుట్టాలు దూరంగా నిలబడ్డారే తప్ప దగ్గరికి రాలేదు.

వాళ్ళ దృష్టిలో నా ఆలోచనలు తప్పు.

నా మానాన నన్ను విడిచి పనుల్లో పడ్డారు. నాకు బాగా గుర్తు. అప్పుడు నాకు పధ్నాలుగేళ్ళు. బాc గొర్లను కాసుకరాపోమన్నాడు.

గొర్లను పచ్చని గడ్డి దొరికే చోటికి తోలుకపోయా. అవి మేస్తుంటే కాక్లాలు వచ్చి వాలాయి. గొర్ల మీద వాలినాయి.

ముక్కుతో పురుగుల్ని పడుతూ గొర్లను మేయనీయటం లేదు.

కోపం వచ్చింది. ఆకలితో వున్న వాటిని ఇబ్బంది పెడుతున్నాయని కాక్లాలను లేపడానికి రాయి విసిరాను.

ఒక్కసారిగా కాక్లాలు గాల్లోకి లేచాయి.

ఒక కాక్లా నా మీదుగా ఎగురుతూ వచ్చింది. నా తల తన్నిపోయింది. నాకు వింతగా అనిపించింది. కాక్లాకు మనిషంటే భయం లేదని నవ్వుకున్నా.

ఆ సాయంత్రం కాక్లా తన్నిపోయిన సంగతి మా బాcకు చెప్పా. ఆయన కంగారు పడ్డాడు. తండాలో అందరూ కీడన్నారు.

బాc అయ్యగారింటికి పరిగెత్తి జరిగిన విషయం చెప్పాడు.

తొమ్మిది రోజుల పాటు రోజుకు ఏడుసార్లు ఆంజనేయ స్వామికి పూజ చేయాలన్నాడు.

ఎవరూ నిద్ర లేవకముందే పూజా కార్యక్రమం ముగించాలి. మా బా నన్ను ఆ తొమ్మిది రోజులు తెల్లారకముందే నాలుగు గంటలకు లేపేవాడు.

వాళ్ళ నమ్మకం పిచ్చిదే కావచ్చు. అది మూఢనమ్మకమని చెప్పినా వినే పరిస్థితిలో లేరు. నా ఆలోచనలు, పద్ధతులు తెలిసిన చుట్టాలు దూరంగా నిలబడ్డారే తప్ప దగ్గరికి రాలేదు.

చన్నీళ్ళతో స్నానం చేసి పూజలు చేసేవాన్ని. కీడు సంగతి ఏమోకాని, ఆ తరువాత నెలరోజుల పాటు జలుబు, జ్వరం. దవాఖాన చుట్టూ తిరిగితే తప్ప తగ్గలేదు.

అప్పుడు పూజలు చేయమన్నారు. ఇప్పుడు మామీకి ఏకంగా చావే చేశారు.

తండా జీవితం గుర్తుకు తెచ్చుకొంటూ వేప చెట్టుకింది మంచంలో ఒరిగాను.

వేప చెట్టు చల్లగా వుంది. ప్రయాణం చేసి అలసిన శరీరం ఆ చల్లగాలికి నిద్రలో సోలిపోయింది.

మంచం వేసుకొని పండుకొన్నా.

ఎంతసేపు నిద్రపోయానో తెలియదు.

కళ్ళు తెరిచేసరికి బక్రా (యాటపోతు) తీసుకొచ్చి కోస్తున్నారు.

గంటలో సొలాయి వండి తెచ్చారు.

కల్లు తెచ్చి తాగమని ఆకు ఇచ్చారు. ఒక పట్టు పట్టిన తరువాత సొలాయి నోట్లో వేసుకొన్నా. అద్భుతమైన రుచి.

"అంతేనా!

ఇంకేం కావాలి?

వీలైతే నాలుగు మాటలు... కుదిరితే కప్పు కాఫీ..."

నా మొబైల్ రింగ్‌టోన్ మోగుతుంది.

ఫోన్ ఎత్తాను. ఏం జరిగింది. ఫోన్ చేయలేదు అని శీనన్న ఫోన్.

సొలాయి ముక్క మరోటి నోట్లో వేస్తూ...

'మామీ బతికే ఉంది. కంగారుపడకు. నువ్వెప్పుడైనా సొలాయి తిన్నావా? అన్నా!'

ఫోన్‌లో శీనన్న నవ్వులు...

నాలోనూ మత్తెక్కిన మనిషి చేసే నవ్వులు.